క్లుప్తంగా

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



మాచర్ల: పూజిత మహిళ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నర్రిశెట్టి కళ్యాణ మండపంలో మహిళలకు కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల రూరల్: ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి తెలిపారు. కాటూరి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ సౌజన్యంతో మండలంలోని తుమ్మలచెరువులోని ఎంపీపీ పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేసినట్లు వివరించారు. సాధారణ వైద్య సేవలు, గుండె, స్త్రీల, కంటి, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్ల, గజ్జి, తామర, ఎలర్జీ, చర్మ వ్యాధుల నిపుణులు హాజరవుతారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

అనుగురాజు విగ్రహ ప్రతిష్ఠా కరపత్రం ఆవిష్కరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం వద్ద యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ పల్నాడు రాజ్యాన్ని పరిపాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని భక్తులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం హాజరైన భక్తులకు పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, గండికోట వెంకటేశ్వర్లు, విగ్రహ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాంబాబు, యాదవ సేవా సమితి అధ్యక్షులు ఆవుల జనార్దన్, కార్యవర్గ సభ్యులు టి. సురేష్, ఇసరాజు అప్పారావు, కొరకుటి శ్రీనివాసరావు, సంక్రాంతి వెంకటేశ్వర్లు, చింతల అజయ్‌కుమార్, వడ్డంపుడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుసేన్



రెంటచింతల: కార్మికులు సంఘంగా ఏర్పడితేనే హక్కులు సాధించుకోవచ్చని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడి హక్కుల సాధనకు సంఘం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షుడిగా కె.రంగనాయకులు, అధ్యక్షులు జానీ బాషా, ఉపాధ్యక్షులు రాజారావు, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి కోటిరెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బారెడ్డిలతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమెర వెంకటరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామంలో జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.13.05 లక్షలు విలువైన నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ సిహెచ్ మణికృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23 తేదీన మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల నామాల మీనా ఇంటిలో చోరీ జరిగింది. ఇంట్లోని 60 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు, ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీనిపై నామాల మీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన గాలం రాజేష్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రాజేష్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకున్నట్లు పోలీసులకు నిందితుడు తెలిపాడు. దీంతో నిందితుడి వద్ద నున్న రూ.13.05 లక్షలు నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

పత్తి రైతుల ఆశలు ఆవిరి

- దెబ్బతీసిన అకాల వర్షాలు
- సగానికి పడిపోయిన దిగుబడి
- పత్తి నాణ్యత లేదని ధర భారీగా పతనం



సాగులో ఉన్న పత్తి పంట

కారెంపూడి: పత్తి రైతు నిండా మునిగారు. భారీ వర్షాలకు పొలాలు దెబ్బతిన్నాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడు తగ్గే అవకాశం ఉంది. పొలంలో ఉన్న విచ్చుకున్న పత్తి నల్లగా జల్లిజల్లిగా మారిపోయింది. ఆ పత్తి తీయడానికి కూలీలు కూడా ముందుకు రావడం లేదు. కిలో రూ.10 చొప్పున కూలీలకు ఇచ్చి పత్తి తీయిస్తున్నారు. తీరా తీసిన పత్తి అమ్ముదామనుకుంటే నాణ్యత లేదని నల్లగా ఉందని క్వింటా రూ.4,500 లోపు ధరకు వ్యాపారులు అడుగుతున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

దిగుబడులపై దిగాలు..

వర్షాలకు ముందు వరకు ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రైతులకు సగటున వచ్చింది. ఆ పత్తి మంచి ధర క్వింటా రూ.7,500 దాకా అమ్మారు. తర్వాత కురిసిన వర్షాలకు చేలో ఉన్న పత్తి తడిసి పాడైపోయింది. కాయలు నల్లగా మారాయి, పుచ్చు గుల్లల సంఖ్య కూడా పెరిగింది. దీంతో రావాల్సిన దిగుబడిపై వర్షాలు విపరీత ప్రభావాన్ని చూపాయి. ఎకరాకు సగటున 12 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని రైతులు ఆశ పడ్డారు. రేటు కూడా బాగా ఉందని పర్వాలేదు ఒడ్డునపడతామనుకున్న సమయంలో విడవకుండా మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి చేలో ఉన్న కాపంతా పాడైపోయింది.

నాణ్యత లేదంటూ..

ఎలాగోలా పత్తి తీయించినా అది నాణ్యత లేకపోవడంతో ధర లేని పరిస్థితుల్లో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇక కౌలు రైతులు ఎకరాకు రూ.20 వేల దాకా నష్ట వచ్చేలా ఉంది. దీంతో పత్తి రైతులు ఉసూరుమంటున్నారు. ఆరుగాలం శ్రమించినా పంట చేతికి వచ్చే సమయంలో అతివృష్టి వారిపాలిట శాపంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పల్నాట పత్తి రైతులు కష్టాల పాలు అవుతున్నారు. పల్నాడులో 25 వేల ఎకరాలలో ముందస్తు వేసవిలో పత్తి సాగు చేశారు. కాపు బాగా కాసి కాయలు పగులుతున్న సమయంలో కురిసిన వర్షాలకు రైతుల ఆశలు ఆవిరయ్యాయి. లేతన జూన్‌లో వేసిన పత్తికి నష్టం లేదు కాని ముదురున వేసవిలో ముందస్తు సాగు చేసిన రైతులు సగం పంట నష్టపోయారు.

ఎకరాకు 6,7 క్వింటాళ్ల నష్టం



నేను నాలుగెకరాలలో పత్తి సాగు చేశా. రెండు ఎకరాలు వేసవిలో వేశాను. అందులో ఇప్పటికి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంకా రావాల్సిన దిగుబడి 6,7 క్వింటాళ్ల దాకా ఉంది. పత్తి కాయలు విచ్చినా నాణ్యంగా లేదు. పత్తి ముద్దగా అవుతోంది. ఉన్న కాయలు కూడా పక్వానికి వచ్చినా బాగా తడవడం వలన సరిగా విచ్చుకోవడం లేదు. లేత పత్తి కాపు దశలో ఉంది. పూత కూడా రాలినా మళ్లీ వస్తుంది, కాని ముదురు పత్తి కాపంతా పూర్తయి కాయలు పగిలి పంట చేతికొచ్చే సమయంలో విడవని వర్షం బాగా నష్ట పరిచింది.

– షేక్ లాల్ సాహెబ్, రైతు, ఒప్పిచర్ల

దిగుబడి తగ్గింది..



నేను 11 ఎకరాలలో పత్తి వేశా. కాపు బాగా కాసింది. దిగుబడి కూడా ఎకరాకు 12 పైన వస్తుందని ఆశలు పెట్టుకున్నా. కాని సగం పంట ఇంటికి చేరింది కాని ఇంకా రావాల్సిన పంట ఉన్న సమయంలో కురిసిన వర్షాలకు విచ్చిన పత్తి ఎకరాకు సగటున 3 క్వింటాళ్ల దాకా తడిసి పోయింది. మిగతా మరో 3 క్వింటాళ్ల దాకా అయ్యే పత్తి కాయలు తడిసి పాడయ్యాయి. పత్తి విచ్చినా నాణ్యత ఉండడం లేదు. కూలీల ఖర్చు కూడా క్వింటా రూ.1,000 పైనే అవుతోంది. తీరా రేటు చూస్తే నాణ్యత లేదని క్వింటా రూ.4,500 లోపే అడుగుతున్నారు. దిగుబడి సగానికి పడిపోయింది. రేటు కూడా బాగా తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది.

– మల్లెల ఆంజనేయులు, రైతు, ఒప్పిచర్ల

ఉత్తమ అవార్డు గ్రహీతలకు అభినందనలు





జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఎంపీడీఓ ప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి

వెల్దుర్తి: స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్ బాబు నుంచి ప్రశంసా పత్రాలను ఎంపీడీఓ డి.ప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. మండలంలో పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి ఇప్పటి వరకు 9 సార్లు ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. అవార్డులు అందుకున్న అధికారులను పలువురు ఉద్యోగులు అభినందించారు.

హౌసింగ్ ఏఈ మరియదాసుకు ఉత్తమ పురస్కారం

మాచర్ల: హౌసింగ్ ఏఈ మరియదాసు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి పురస్కారం అందుకున్నారు. హౌసింగ్ శాఖకు చెందిన సిబ్బంది, అధికారులు ఆయన్ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మరియదాసు మాట్లాడుతూ మరింత బాధ్యతలు పెరిగాయన్నారు.

మండలంలో గృహ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

20న ఘంటసాల కళాపరిషత్ నాటకోత్సవాలు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

సత్తెనపల్లి: ఘంటసాల కళాపరిషత్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడివద్ద ఘంటసాల కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు జరుగుతాయని కళాపరిషత్ అధ్యక్షుడు బి.సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని వడ్డవల్లిలో శనివారం నాటక ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ నాటకోత్సవాలకు ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. నాటకోత్సవాల్లో మొదటి ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి భువి కోరని భ్రమణం నాటిక, రెండవ ప్రదర్శనగా ప్రదక్షిణ ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి ఎవరు నాటిక, మూడవ ప్రదర్శనగా పట్టణ సాంస్కృతిక సంఘం వారి హాస్యవల్లరి, నాలుగో ప్రదర్శనగా శాతవాహన వారి శ్రీరామ శ్రీ ఆంజనేయ సంవాదం పౌరాణిక నాటిక ప్రదర్శించబడుతుందన్నారు. ఘంటసాల కళా నిలయం ఆర్గనైజింగ్ కార్యదర్శి కంబాల శ్రీనివాస్, దాసరి తిరుపతిరావు, బోడపాటి తిరుపతిరావు, తోట హరిబాబు, శిఖ ఆదామ్, మాతంగి సాంబశివరావు, సభ్యులు మారం మనోహర్, వెంకటేష్, రాజబాబు పాల్గొన్నారు.

గోకులకృష్ణ.... గోపాలకృష్ణ



రెంటచింతలలో కృష్ణుడు ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం



సారంగపల్లి అగ్రహారంలో పూజలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ దంపతులు



రెంటచింతలలో ఆరోగ్యపురంలో శ్రీకృష్ణుడు వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు



కారెంపూడి రోడ్డులో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



గంగిరెడ్డిపాలెంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ తిరుమలరావు

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలోని గీతిక సీబీఎస్ఈ స్కూల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ తాళ్లపల్లి బాల గంగాధర్ రెడ్డి విద్యార్థులకు భారతదేశ సంప్రదాయాల గురించి వివరించారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని కృష్ణుడు ఆలయంలో శ్రీ కృష్ణుడు వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆలయం చైర్మన్ కట్టేబోయిన సైదులు, బీజేపీ నాయకులు ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ రామకృష్ణా సేవా సమితి, రామకృష్ణాగురుకులం ఆధ్వర్యంలో ఉట్ల స్తంభాల సెంటర్లో 45 మంది బాలబాలికలు కృష్ణుడు వేషధారణ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో పెద్దసంఖ్యలో చిన్నారులు, యువకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా పాల్గొని పోటీపడ్డారు. పల్నూరి ప్రసాదరావు, గొంటు ఆదిరెడ్డి, పల్నూరి సుబ్బారావు, బోడపాటి రామకృష్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీ రామ కృష్ణా సేవా సమితి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి, పల్నూరి శివ, పల్నూరి రాముడు (అయోధ్య రాములు), నాళం పెదబాబు, పల్నూరి శివరామకృష్ణ, యేచూరి రాము పర్యవేక్షించారు.

రెంటచింతలలో..


రెంటచింతల: స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని కృష్ణుడు ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా నిర్వహించిన కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఆలయ చైర్మన్ కట్టేబోయిన సైదులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, రెంటాల సర్పంచ్ బి. సుంకయ్య, నాయకులు మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య పాల్గొన్నారు.

దాచేపల్లి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కారంపూడి రోడ్డులో శ్రీకృష్ణుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం శ్రీకృష్ణుని విగ్రహాల వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని సారంగపల్లి అగ్రహారంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం వద్ద ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉదయానే గంగమ్మ తల్లి దేవాలయం వద్ద శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించటంతో అమ్మవారిని కూడా భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం సాయంత్రం సమయంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు జంగా కృష్ణమూర్తి హాజరై ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గురజాల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పండగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. శ్రీ కృష్ణుడు ఉపదేశించిన గీతా సారాంశాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. శ్రీ కృష్ణుడి విగ్రహన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడులో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కావూరి అంజిబాబు పాల్గొన్నారు. పులిపాడు గ్రామంలో ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక నరసరావుపేట ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాలి వెంకటేశ్వర్లు, నాలి కృష్ణ, పాల్గొన్నారు.


మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గంగిరెడ్డిపాలెం గ్రామంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఎస్ఐ తిరుమల రావు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలని సుందరంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




చర్లగుడిపాడు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీపీ తదితరులు



గీతిక సీబీఎస్ఈ స్కూలులో రాధాకృష్ణ వేషధారణలో విద్యార్థులు



మాడుగులలో ఉట్టి కొడుతున్న బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గాంధీ



పిడుగురాళ్లలో గంగమ్మ గుడి వద్ద ఉట్టికొడుతున్న యువకులు

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

19న చిలకలూరిపేటలో వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేటటౌన్(యడ్లపాడు): విద్యుత్ వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారానికి న్యాయ సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు టౌన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు తెలిపారు. ఈ నెల 19వ తేదీ మంగళవారం చిలకలూరిపేటలోని సింగు మినీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే ఈ సదస్సులో వివిధ ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ పరమైన తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదస్సులో జొకిపత్రు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట టౌన్-1, టౌన్-2, రూరల్ మండలం, గణపవరం, యడ్లపాడు ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సుదీర్ఘంగా ఉన్న తమ సమస్యల్ని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదస్సులో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విజయవాడకు చెందిన అధ్యక్షులు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎన్.విక్టర్ ఇమ్మానియేలు, సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. కావున విద్యుత్ అంతరాయాలు, మీటర్ సమస్యలు, హెచ్చుతగ్గులు, బిల్లింగ్ సమస్యలు, సరఫరాలో లోపాలు వంటి ఏవైనా పరిష్కారం కాని సమస్యలు ఉన్న వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. ఈ సదస్సులో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించు కోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై ఏడుకొండలు కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్

నరసరావుపేట: మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావొస్తున్నా మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కారం కోసం ఈ నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు అన్ని మున్సిపల్ కేంద్రాలు, పట్టణాలలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు అమలు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రాష్ట్రం మొత్తం ఒకే వేతన విధానం అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో నియమించిన బదిలీ కార్మికులకు రూ.9 వేలు నుంచి రూ.12 వేలు వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, వారికి కూడా రూ.21 వేలు వేతనాలు చెల్లించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్ల నుంచి నెలకొన్న సరెండర్ సెలవులకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యవసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాల నాయకులతో సంప్రదింపులు నిర్వహించి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రు. పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు వెంకయ్య, వీరకుమార్, షేక్ చిన్న అల్లాబక్షు, సోమశేఖర్ పాల్గొన్నారు.